
అడకత్తెరలో.. వీఆర్వోలు



ఒక పక్క ఎమ్మెల్సీ ఓటర్ల పరిశీలన, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేపని... మరోపక్క హౌస్ హోల్డ్ సర్వేకు సంబంధించి జియో కో ఆర్డినేట్స్ తీసుకోవాల్సిన పని. వీటి లో ఓట్ల పరిశీలన రెవెన్యూ అధికారులు చూస్తుం టే, హౌస్ హోల్డ్ సర్వే ఎంపీడీవో పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ రెండింటికీ వీఆర్వోలు వెళ్లాల్సిందే. అయితే ఇక్కడే అసలు చిక్కు వచ్చిపడితే, వివిధ శాఖల మధ్య వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చు మెల్లగా రాజుకుంటోంది. వీఆర్వోలను విధులకు పంపే విషయంలో ఎవరి అధికారాన్ని వారు చూపిస్తుంటే, మధ్యలో వీఆర్వోలు నలిగిపోతున్నారు.

- గత వైసీపీ సర్కారు పాలనలో చేసిన మార్పులే కారణం
- సచివాలయాల ఏర్పాటు మినహా పటిష్ట నిర్వహణ లేకే
- వీఆర్వోలు పనిచేసేది రెవెన్యూలో... వేతనం ఇచ్చే అధికారం ఎంపీడీవోలకు
- తహసీల్దార్, ఎంపీడీవోల మధ్య పెరుగుతున్న దూరం
- ఎన్నికల విధులు, హౌస్ హోల్డ్ సర్వేల పనుల్లో గందరగోళం
- మా ఉత్తర్వులు ఫాలో అవ్వాలంటే మా ఉత్తర్వులంటూ ఆధిపత్య పోరు
- ఛార్జిమెమోలు, వేతనాల నిలుపుదల వరకు ముదిరిన వ్యవహారం
- కలెక్టర్ల దృష్టికి తీసుకెళుతున్న వీఆర్వోలు

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు తప్పనిసరి కావటంతో ఓటర్ల దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలో, సర్వేకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపమన్నట్టు తయారయింది వీఆర్ఓల పరిస్థితి. ఒకపక్క తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్లాలని ఆదేశాలిస్తుంటే, మరోపక్క ఎంపీడీఓలు మాకు తెలియకుండా మీ ఇష్టమొచ్చినట్టు వెళ్లిపోతే ఎట్లా! జీతమిచ్చేది మేమయితే మా మాట ఎందుకు వినరంటూ మెమోలు ఇచ్చే పరిస్థితి నుంచి చివరకు జీతాలు ఆపేస్తామని బెదిరించే వరకు వెళ్లిందంటే వారిమధ్య అధికారిక పోరు ఎంతవరకు వెళ్లిందనేది అర్థమవుతుంది. విధులు సక్రమంగా చేద్దామనుకునే వీఆర్ఓల పరిస్థితి ఇబ్బందికరంగా మారితే, తహసీల్దార్, ఎంపీడీఓల మధ్య ఏర్పడుతున్న సమన్వయ లోపాన్ని కొందరు వీఆర్ఓలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అసలు విధులలోనే లేకుండా తహసీల్దార్ అడిగితే, ఎంపీడీఓ రమ్మన్నారని, ఎంపీడీఓ ఫోన్ చేస్తే, తహసీల్దార్ మరో పనికి పంపారంటూ ఇద్దరి దగ్గర ఒకరిపైఒకరికి చెప్పి తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్ని మండలాల్లో రెండు శాఖల మధ్య చిచ్చు రాజుకుంటూనే ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే ఆందోళనకు దిగాలనే ఆలోచనకు వీఆర్ఓలు వచ్చినట్టు చెబుతున్నారు. దీనంతటికీ వైసీపీ సర్కారు కాలంలో వీఆర్ఓల విధులు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నా, సచివాలయాల ఏర్పాటు తర్వాత వారితోపాటే వీరి వేతనాలు కూడా ఎంపీడీఓలు ఇచ్చేలా మార్పులు చేయటమే. అయితే రెండూ ప్రభుత్వ శాఖలే కావటంతో వారి మధ్య అధికారిక పోరు లేకుండా సమన్వయంతో పనిచేస్తే అంత సమస్య అయ్యేదికాదు. మొత్తం మీద గత వైసీపీ సర్కారు చేసిన అనాలోచిత మార్పులు ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో చిచ్చు రేపటానికి కారణమవుతోంది.

అంతా ఓటర్ల జాబితా బిజీలో

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధంచేసే పని ఒకప క్షన ఉంటే, ఈ నెల 6 నుంచి బుదవారం వరకు ఓటరు దరఖాస్తుల పరిశీలన పనిలో వీఆర్ఓలు ఉన్నారు. ఈ నెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. అప్పటి నుంచి డిసెంబర్ 7 వరకు మళ్లీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, ఇతర లోపాల పరిశీలన పని ఉంటుంది. వీటిని తప్పనిసరిగా బీఎల్ఓలతే చెయ్యాల్సి ఉంది. త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సిద్ధంచేసే పనికూడా జరుగుతోంది. దీనికి ఓటర్ల దరఖాస్తులు ఉండవు. అయితే నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆయకట్టుదారుల వివరాల ఆదారంగా రెవెన్యూ శాఖే ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సి

(మిగతా 8వ పేజీలో..)

రూ.కోట్లలో.. కిక్క



- అందుబాటులో కోరుకున్న మద్యం
- నెల వ్యవధిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.260 కోట్లకు తాగేశారు
- బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం విక్రయం
- జగన్ హయాంలో కన్నా ఒక్క నెలలో రూ.20 కోట్ల అదనపు సేల్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న బ్రాండ్లు.. కావాల్సిన మద్యం.. గతంలోలా చెల్లింపులకు పరిమితులు లేకపోవడం.. కొన్ని బార్లలోనూ ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు.. నేపథ్యంలో అటు మందుబాబులు, ఇటు ఎక్సైజ్ శాఖ ఖుషీ చేసుకుంటోంది. మందుబాబులు తెగ తాగేస్తోండగా.. ఎక్సైజ్ శాఖకు రూ.కోట్లు కిక్కు వస్తోంది. బ్రాందీ షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. జగన్ హయాంలో గత ఐదేళ్ళుగా జేబులో దండిగా డబ్బులున్నా కూడా కోరుకున్న మద్యాన్ని కొనుక్కొని తాగలేని పరిస్థితి ఉండేది. పేరొందిన డిస్టలరీల కంపెనీలు ఉత్పత్తి చేసే మద్యంకు బదులు జే బ్రాండ్ పేరుతో నాశిరకం మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో అమ్మించారు. గత్యంతరం లేక పలువురు నాశిరకం మద్యాన్ని కొనుగోలు చేసి తాగి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోరుకున్న మద్యం అందుబాటులోకి తెస్తామని, చౌక మద్యాన్ని నాణ్యంగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే

(మిగతా 6వ పేజీలో..)

- గుంటూరు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో తనిఖీలు
- స్వయంగా తేమ శాతాన్ని పరిశీలించిన సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్‌కురదగీ

6

పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లపై కేంద్రానికి నివేదిక



గుంటూరులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ

పొదుపు సొమ్ము రూ.10 లక్షలు గోల్‌మాల్

- రుణాల చెల్లింపు నగదును స్వాహా చేసిన యానిమేటర్
- పొన్నూరు మండలం దొప్పలపూడిలో వెలుగుచూసిన వైనం

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు

- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మిదేవి

8

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- మృత్యువుతో పోరాడుతున్న భర్త
- పెదకాకాని మెయిన్ సెంటర్‌లో ఘటన

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

- ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ
- రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

ముసాయిదా ముద్రణకు సిద్ధం

- పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం
- బుధవారం సాయంత్రానికి 5 శాతమే పెండింగ్
- ఓటు కోసం 3లక్షల 32వేల 783మంది దరఖాస్తు
- 23న డ్రాఫ్టు లిస్టు విడుదల చేస్తామన్న ఈఆర్వో కాజావలి

జేకేసీ విద్యార్థి కావడం గర్వకారణం

- ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- ఆడిటోరియం ప్రారంభోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



సభలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, వేదికపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మన్నవ మోహనకృష్ణ, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల ఎంతో మంది ఉన్నతికి కారణమైంది. ఇలాంటి కళాశాల విద్యార్థినని చెప్పుకోవడం గర్వకారణం. కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించారు. ఫలితంగా ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు.. అని రాష్ట్ర డీజీపీ, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పునర్ నిర్మించారు. రూ.2.50 కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ ఆడిటోరియాన్ని బుధవారం డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసంగిస్తూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎంతోమందికి చదువుతో పాటు సంస్కారం నేర్పించిన ఘనత జేకేసీదన్నారు. ఆకృతిలేని రాళ్ళలాంటి తమలాంటి ఎంతోమందిని శిల్పాలుగా తీర్చిదిద్దిన ఘనత జేకేసీ అధ్యాపకులదన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం జేకేసీ కళాశాలలో చదువుకున్నానని, అప్పట్లో ఇక్కడ నేర్పిన చదువు, క్రమశిక్షణ కారణంగానే నేషనల్ పోలీసు అకాడమీలో చేరినట్లు చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తమకు క్రమశిక్షణ, అంకితభావం కళాశాలలో చదుకునే సమయంలో అలవడ్డాయన్నారు. ఫలితంగానే సేవా, రాజకీయరంగాల్లో రాణిస్తున్నట్లు వారు చెప్పారు. జేకేసీ పూర్వ విద్యార్థులు కావడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ, కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నిర్మాణం.. క్రిటికల్

- సందిగ్ధంలో క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు
- రూ.36.35 కోట్లు మంజూరైనా టెండర్ దశలోనే..
- ప్రతిపాదిత స్థలం ఇచ్చేందుకు అంగీకరించని పోలీసుశాఖ
- కనీస ప్రయత్నం చేయకుండా చోద్యం చూస్తున్న వైద్యశాఖ
- సీసీబీ కోల్పోయే పరిస్థితిలో నరసరావుపేట ఏరియా ఆస్పత్రి

(నరసరావుపేట, ఆంధ్ర జ్యోతి)

పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనా.. స్థలం కేటాయింపు ప్రక్రియ ముందుకు సాగడంలేదు. వైద్య ఆరోగ్య.. పోలీసు శాఖల మధ్య స్థలం పంచాయితీ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రధాన మంత్రి అయూష్మాన్ భారత్ కింద నరసరావు పేటలోని ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించాల్సిన క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ)పై సందిగ్ధత నెలకొన్నది. ప్రధాన మంత్రి అయూష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ కింద సీసీబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.36.35 కోట్లు మంజూరు చేస్తూ గత నెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. భవన నిర్మాణానికి టెండర్ నిర్వహించాలని ఏపీఎంఎస్ఐడీసీని కేంద్ర పభుత్వం ఆదేశించింది. ఈ మేరకు టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నా స్థలం కేటాయించలేదు. ప్రతిపాదిత స్థలాన్ని ఇచ్చేందుకు పోలీసు శాఖ ససేమిరా అంటోంది. పోలీసు కార్యాలయ నిర్వహణ కన్నా పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న అంశాన్ని పోలీసు అధికారులు విస్మరించడంపై విమర్శలు వస్తున్నాయి.

పోలీసు శాఖ మంకుపట్టు..

నరసరావుపేట ఆస్పత్రి ఐదెకరాల్లో ఉంది. ఈ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని పల్నాడు జిల్లా ఏర్పాటుతో ఎస్పీ కార్యాలయం, ఇతర పోలీసు కార్యాలయాల నిర్వహణకు తాత్కాలికంగా పోలీసు శాఖ తీసుకుంది. అయితే ప్రస్తుతం ఆస్పత్రి ప్రాంగణంలో సీసీబీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో పోలీసు శాఖ గతంలో తాత్కాలికంగా తీసుకున్న స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు తిరిగి ఇచ్చేయాలి. అయితే స్థలాన్ని ఖాళీ చేసే విషయంలో పోలీసు శాఖ మిన్నకుంటోంది. దీంతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడింది. క్రిటికల్ కేర్ భవనం నిర్మించినా ఎస్పీ కార్యాలయ నిర్వహణకు అడ్డంకి ఉండదు. గతంలో పోలీసు శాఖ తీసుకున్న స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వినియోగిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో కాకుండా వేరొక చోట నిర్మిస్తే అత్యవసర వైద్యం అవసరమైన రోగులను తరలించాలంటే ప్రమాదమే. అదే ఆస్పత్రిలో సీసీబీ నిర్మిస్తే అత్యవసర రోగుల ప్రాణాలను కాపాడే వీలుంటుంది. భవన నిర్మాణం టెండర్ ప్రక్రియకి వచ్చినా స్థలం కేటాయింపు జరగకపోవడంతో ప్రతిష్ఠాత్మకమైన సీసీబీని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. తమ కార్యాలయాలను ఎక్కడైనా నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్వహించాల్సి ఉన్నా పోలీసు అధికారులు మంకుపట్టు వీడటంలేదు. పోలీసు శాఖ చేతిలో ఉన్న స్థలాన్ని సీసీబీ నిర్మాణం కోసం వదిలేస్తేనే పేదలకు మేలు జరుగుతుంది. స్థలాన్ని ఇచ్చేందుకు పోలీసు శాఖ అంగీకరించని పక్షంలో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు దూరమయ్యే ప్రమాదం ఉంది. పోలీసు శాఖ వాహనాల కోసం వినియోగిస్తున్న స్థలాన్ని సీసీబీ నిర్మాణం కోసం ఇచ్చేందుకు పోలీసు శాఖ స్పందిస్తుందా మొండిగా వ్యవహరిస్తోందో చూడాలి.



సీసీబీ నమూనా భవన చిత్రం



పోలీసు శాఖ చేతిలో ఖాళీగా ఉన్న సీసీబీ ప్రతిపాదిత స్థలం

సీసీబీతో పేదల ఆరోగ్యానికి భరోసా

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ పేదల ఆరోగ్యానికి ఒక భరోసా. అత్యాధునికి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో నిర్మించనున్న సీసీబీ విభాగంలో 75 పడకలను ప్రభుత్వం మంజూరు చేసింది. భవన నిర్మాణంకు సంబంధించిన ప్లాన్‌ను కూడా సిద్ధం చేసింది. సీసీబీలో ఐసీయూ, ఐసోలేషన్ వార్డులు, ఓటీ, లాబర్.. డెలివరీ.. రికవరీ గదులు(ఎల్‌డీఆర్స్) ఉంటాయి. 75 పడకల సీసీబీని 6,375 చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మించనున్నారు. ఐసోలేషన్ వార్డులో 30 పడకలు, ఐసీయూలోని 12 పడకల్లో రెండు చిన్నపిల్లలకు కేటాయిస్తారు. అత్యాధునికి వైద్య పరికరాలు, బెడ్లను సమకూర్చి, పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన సీసీబీ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నేడు విడుదల చేయాల్సిన నోటిఫికేషన్ నిలిపివేత
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధమైన ఓటర్ల జాబితాలు.. ఏడు లక్షల మందికి ఓటు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికలకు అధికారులు సిద్ధమవగా.. తమకు గ్రామాల్లో పట్టు ఉందని నిరూపించుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతుండగా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలకు సంబంధించి గురువారం విడుదల చేయాల్సిన నోఫికేషన్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) పరిధిలోని టీసీల వారీగా రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 2,500 మంది నుంచి 3,000 వరకు రైతులను ఓటర్లుగా నమోదు చేశారు. సుమారు ఏడు లక్షల మందిని ఓటర్లుగా అధికారులు గుర్తించారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిం చేందుకు 2,628 టీసీల వారీగా ఓటర్ల జాబితాలను అధికారులు విడుదల చేశారు. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో నోటిఫికేషన్ నిలిచిపోయింది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా కైవాసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

మునిపల్లెలో చారిత్రక ఆనవాళ్లు గుర్తింపు



మునిపల్లెలోని వీరగల్లు శాసనం

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో పురావస్తు చారిత్రక ఆనవాళ్లు అయిన వీరగల్లు శాసనం లభ్యమైనట్లు యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. మునిపల్లె గ్రామానికి చెందిన పల్లెపోతల సుబ్రహ్మణ్యం, సూధనగుంట శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం శ్రీనాథ్‌రెడ్డి మునిపల్లె గ్రామానికి వచ్చి శాసనాలను పరిశీలించారు. అగస్త్యేశ్వర ఆలయంలో నంది బొమ్మ చెక్కిన శిలాఫలకంపై ఉన్న శాసనాన్ని పరిశీలించారు. ఈ శాసనం భూమిలోపల ఉండగా, ఇటీవలే ఆలయ మరమ్మతుల్లో భాగంగా పైకి లేపారు. మట్టి లోపల ఉండటం చేత ఈ శాసనం చాలా భాగం చదవటానికి వీలు లేకుండా పోయింది. కేవలం కొద్దిపాటి అక్షరాలు మాత్రమే గుర్తించ గలుగుతున్నట్లు శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు. 18, 19 శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో గ్రామ విషయాలు ఉన్నట్లు చెప్పారు.

గోళ్లమూడిపాడు రోడ్డులో..



వీరగల్లు శాసనాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి

అలాగే గ్రామ శివారులోని గోళ్లమూడిపాడు రోడ్డులో పంట పొలాల్లో కూరుకుపోయి ఉన్న వీరగల్లు శిల్పాని శ్రీనాథ్ రెడ్డి గుర్తించారు. ఈ శిల్పం పూర్వకాలంలో గ్రామ పెద్ద, ఒక అధికారి, గ్రామ సంరక్షణలో భాగంగా యుద్ధంలో లేదా జంతువులతో పోరాడుతూ మరణించిన వారి గుర్తుగా ప్రతిభను చెక్కినట్లు తెలిపారు. సుమారు మూడు అడుగుల పొడవున్న ఈ వీరగల్లు శిల్పంపై ఒక పురుషుడు, ఇరువైపులా స్త్రీల ప్రతిమలు ఉన్నాయి. ఇవి గ్రామ చరిత్రకు ఆనవాళ్లు అని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పమిడిపాడు గ్రామానికి చెందిన కొల్లా సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాటికుర్తి రవికిషోర్‌రెడ్డి, గాడిపర్తి వంశీకృష్ణ, గాడిపర్తి దయాసాగర్, గాడిపర్తి ప్రసాద్, గాడిపర్తి శ్రీనివాసరావు, పొదిలి మదార్‌సాహెబ్‌లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. కొల్లా సాంబశివరావుకు నరసరావుపేట మండలం అర్వపల్లి గ్రామంలో 6 ఎకరాల పొలం ఉందనీ, 2022 మార్చి 18న ఈ ఏడుగురు తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, తనను బెదిరించి, తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లపై కేంద్రానికి నివేదిక

- సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ



మార్కెటింగ్, సీసీఐ అధికారులతో మాట్లాడుతున్న విజయ్ కురదగీ

గుంటూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లును గుర్తించి కేంద్రానికి నివేదిక అందజేయనున్నట్లు సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ వెల్లడించారు. బుధవారం ఆయన గుంటూరు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ పత్తి రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలోని గాయత్రి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో స్వయంగా తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బూసిమి రాజబాబు ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీసీఐ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తేమశాతంలో సడలింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు నోటిపై చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులతో కూడా సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మరో అధికారి రాక...

ఉమ్మడి జిల్లాలో సీసీఐ పనితీరును పరిశీలించేందుకు కేంద్రం నుంచి మరో మహిళా అధికారి రానున్నారు. గురువారం ఆమె ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. పత్తి కొనుగోలు వ్యవహారంలో సీసీఐ పనితీరును పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఫిర్యాదు, విజ్ఞప్తి మేరకు ఈ అధికారులను కేంద్రం ఆఘమేఘాల మీద గుంటూరు జిల్లాకు పంపుతున్నారు.

ఎనిమిది ప్రారంభం... నాలుగు సెంటర్లలో కొనుగోళ్లు

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 15 జిన్నింగ్ మిల్లులను నోటిపై చేశారు. అయితే వాటిలో ఎనిమిది సెంటర్లు ప్రారంభించినా, కేవలం నాలుగు సెంటర్లలో మాత్రమే పత్తి కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల కూడా రైతులు పత్తి అమ్మకాలకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు బయ్యర్లు అతి భయంతో కొనుగోలుకు దూరంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు



డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి

గుంటూరు సిటీ, తాడికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు నికరాదాయాన్ని అందించే మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు జరుపుతున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి వెల్లడించారు. బుధవారం తాడికొండ మండలం లాం లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సీనియర్ అగ్రికల్చరల్ స్పెషలిస్ట్ డా.సంతోష్ కుమార్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు డా. జి.శివన్నారాయణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ అధికారులతో రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులు, విశ్వవిద్యాలయ పాత్ర మొదలగు విషయాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వరి, వేరుశనగ, అపరాలు, చిరుధాన్యాలు మారిన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ మేలైన దిగుబడినిచ్చే పంటల రకాలను తయారు చేయడంలో విశ్వవిద్యాలయం ముందుందని తెలిపారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన వరి రకాలు పలు రాష్ట్రాల్లో అధికంగా సాగులో ఉన్నాయని తెలియజేశారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నికర సాగు భూమి రోజురోజుకీ తగ్గుతున్న పరిస్థితుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, దిగుబడి పెరిగే విధంగా పరిశోధనలు చేయాలని, మొక్కజొన్నలో ముఖ్యంగా పిండి పదార్థం ఎక్కువ ఉండే రకాలను తయారు చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డా.జి.రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌రావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, డీన్ ఇంజినీరింగ్ డా.ఎ.మణి, యూనివర్సిటీ లైబ్రేరియన్ డా.పి.సాంబశివరావు పాల్గొన్నారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానించారు.

రూ.కోట్లలో.. కిక్

(5పేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అప్పటి వరకు కొనసాగుతున్న మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉండే కేవలం నగదు లావాదేవీలు తొలగించి డిజిటల్ పేమెంట్స్‌ను కూడా అమల్లోకి తెచ్చారు. గత నెల దసరా పండుగ రోజు నుంచి కొత్త మద్యం షాపులు వెలిశాయి. అప్పటి వరకు కేవలం జేబులో నగదు ఉంటే మాత్రమే మద్యం కొనుక్కునే అవకాశం ఉండేది. డిజిటల్ లావాదేవీలు అమల్లోకి రావడంతో క్రెడిట్‌కార్డులు ఉన్నవారు సైతం ఎంచక్కా వైన్ షాపులకు వెళ్లి మద్యం కొనుగోలు చేస్తున్నారు. దసరా పండుగ ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం బ్రాండ్ల పేర్లు కూడా వింతగా ఉండేవి. బూమ్..బూమ్, బ్రిటిష్ ఎంపైర్ వంటి బీర్లు, ఆంధ్రగోల్డ్ విస్కీ, హైదరాబాద్ బ్లూ విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీలు వంటివి మాత్రమే అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన కొత్త మద్యం షాపుల్లో ఏ బ్రాండ్ మద్యమైనా అందుబాటులోకి వచ్చింది. కింగ్ ఫిషర్, బడ్వైజర్, నాకౌట్ వంటి ప్రముఖ బ్రాండెడ్ బీర్లు దొరుకుతున్నాయి. దీంతో ఈ నెల రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత నెల 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అంటే 30 రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.259 కోట్ల 19లక్షల అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.208 కోట్ల విలువ చేసే మద్యం కేవలం కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుల ద్వారానే జరిగింది. మిగతా అమ్మకాలు బార్లు, క్లబ్‌లలో జరిగాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129, బాపట్ల జిల్లాలో 117 కొత్తగా వెలిశాయి. అయితే బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కంటే గుంటూరు జిల్లాలోనే మద్యం దుకాణాల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పల్నాడు జిల్లాలో రూ.93 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం అమ్మకం జరిగింది. ఇక గుంటూరు జిల్లాలో రూ.115 కోట్లకుపైగా విలువ చేసే మద్యం విక్రయించారు. ఇందులో ఒక గుంటూరు నగరంలోనే రూ.50 కోట్ల మద్యాన్ని కేవలం దుకాణాల ద్వారానే కొనుగోలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల్లోనే రూ.34 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.16 కోట్ల అమ్మకాలు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో అత్యధికంగా రూ.13 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. అక్టోబరు 16కు ముందు జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేవి. అప్పటి అమ్మకాలతో బేరీజు వేసుకుంటే ప్రస్తుతం ఇంచుమించు నెలకు రూ.20 కోట్ల అమ్మకాలు పెరిగాయి.

సరఫరాకు మించి రూ.99 మద్యానికి డిమాండ్

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా డిస్టలరీ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాల మేరకు నాణ్యతతో కూడుకున్న చౌక మద్యం రూ.99కే అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో తొలుత ఈ మద్యం అందుబాటులో లేదు. అయితే కొద్ది రోజులు ఆలస్యంగానైనా సరే మార్కెట్లోకి రూ.99 మద్యం వచ్చింది. ఈ నేపథ్యంలో వీఎస్‌వోపీ వారి బ్రాందీ(ట్రోపికాన)కు డిమాండ్ విపరీతంగా ఉంది. ఇది డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రస్తుతానికి సరఫరా లేదు. త్వరలో ఈ బ్రాండ్లను కూడా భారీగా డంప్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

మద్దతు ధర కల్పించటానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు మర్రెడ్డి వారి కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అధ్యక్షత జరిగిన సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 3.4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 45 క్లస్టర్స్ ద్వారా 156 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1740 ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చేటప్పుడు 17 శాతం తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. 17 శాతం కంటే తేమ ఎక్కువ ఉంటే తేమ శాతంను బట్టి ధాన్యానికి ధర నిర్ణయిస్తారని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమకానున్నట్లు చెప్పారు. మిల్లర్ల వద్ద ధాన్యానికి మంచి ధర వస్తే రైతులు అమ్ముకోవచ్చు అని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. సర్పంచి అరుణాబాయ్, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీలక్ష్మి, జీడీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ హరిగోపాల్, ఏడీఏ ఉషారాణి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలపై ఆసక్తి ఉండాలి



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఆటలపై ఆసక్తి ఉండాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు బుధవారంతో ముగిశాయి. కళాశాలలోని డాక్టర్ బీవీ.నాధ్ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సభకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించగా డాక్టర్ కరుణసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ త్వరలో జరగనున్న సదరన్ జోన్ క్రీడలకు సమయాత్తం కావాలన్నారు. గౌరవ అతిథి ఐటీసీ సీనియర్ మేనేజర్ వీవీఆర్ దీక్షిత్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహ పూర్వక వాతావరణం లభిస్తుందన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ వలనే క్రీడా సాంస్కృతిక పోటీలు సమర్థవంతంగా నిర్వహించామని యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రవికాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ డీవీ సాయిరాం కుమార్ బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఆటల పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి బాపట్ల వ్యవసాయ కళాశాలలో పోటాపోటీగా జరిగాయి. బుధవారం ముగింపు కార్యక్రమాన్ని డాక్టర్ బీవీ.నాధ్ ఆడిటోరియంలో నిర్వహించారు. బాలికల విభాగంలో బాపట్ల వ్యవసాయ కళాశాల, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, 400 మీటర్ల పరుగు, షార్ట్‌పుట్ పోటీల్లో విన్నర్స్‌గా, క్యారమ్స్‌లో రన్నర్స్‌గా ఉంటూ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. తెలుగు వ్యాసరచన, ఇంగ్లిష్ వక్తృత్వ, కవితల పోటీ, పోస్టర్ మేకింగ్ తదితర పోటీల్లో విన్నర్స్‌గా నిలిచి ఉత్తమ నటి అవార్డు సాధించి సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో గెలిచి మరో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవశం చేసుకున్నారు.

ఇళ్ల పట్టాల పేరుతో రూ.7 వేల కోట్ల దోపిడీ

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేటలో ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూ సేకరణలో భారీ అవినీతి జరిగిందని, ఈ స్కామ్‌లో మాజీ మంత్రి విడదల రజిని పాత్ర ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూసేకరణలో విడదల రజిని భారీ కుంభకోణానికి పాల్పడ్డారని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆమె వల్ల నష్టపోయిన రైతులు గొడవ చేయటంతో విడదల రజిని కొంతమందికి తిరిగి డబ్బులు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్‌లో విడదల రజిని పాత్రను ఆధారాలతో నిరూపిస్తామని ప్రత్తిపాటి సవాల్ చేశారు. చిలకలూరిపేటలో జరిగిన విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పేరుతో జరిపిన భూసేకరణలో దాదాపు రూ.7 వేల కోట్ల దోపిడీ జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు. నివాసానికి పనికిరాని ముంపు భూములను లక్షలు పెట్టి ప్రభుత్వం ద్వారా కొనిపించి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. జగన్ జమానాలో జరిగిన ఈ భారీ అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలని, సీఐడీతో గాని, హౌస్ కమిటీతో గాని సమగ్ర విచారణ జరిపి, దీనివెనుక ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వాన్ని కోరారు.

రుణాల చెల్లింపు నగదు రూ.10 లక్షలు గోల్‌మాల్

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామంలో పొదుపు మహిళలకు సంబంధించి రుణాల చెల్లింపు నగదును యానిమేటర్ స్వాహా చేసిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో ఓంకార్, శాంతి గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఓంకార్ గ్రామ సమాఖ్య యానిమేటర్‌గా పని చేస్తున్న అరుణ గత మార్చి నెలలో మృతి చెందారు. ఆ తరువాత మరో యానిమేటర్ ఈ ఓంకార్ గ్రామ సమాఖ్యకు సంబంధించి రుణ చెల్లింపుల పర్యవేక్షణ చేశారు. అయితే ఏపీఎం గానీ, సీసీలు గానీ ఇందుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఓంకార్ గ్రామ సమాఖ్యలో 27 పొదుపు సంఘాల్లో 300 మంది సభ్యులు ఉన్నారు. ఈ గ్రామ సమాఖ్యకు శ్రీనిధి రుణాలు, స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్ యోజన పథకం, ఉన్నతి పథకాల నుంచి సభ్యులకు రుణాలు మంజూరైయ్యాయి. రుణాలు పొందిన మహిళలు ప్రతి నెలా వాయిదాల నగదును గ్రామ సమాఖ్యకు చెల్లిస్తారు. అయితే ఈ నగదును యానిమేటర్, సీసీ ఇద్దరూ కలిసి వసూళ్లు చేశారని పొదుపు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. యానిమేటర్ అరుణ మృతి చెందిన తరువాత నాలుగు నెలల పాటు వేరొక గ్రామ యానిమేటర్ రుణాల నగదు చెల్లింపులను పర్యవేక్షించారు. ఈ కాలంలో సుమారు రూ.3.50 లక్షల నగదు గోల్‌మాల్ అయినట్లు సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పొదుపు మహిళలు డ్వాక్ర ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆరా తీసిన అధికారులకు మరి కొన్ని అక్రమాలు తెలిసినట్లు సమాచారం. శాంతి గ్రామ సమాఖ్యలో కూడా రూ.6 లక్షల నగదు స్వాహా అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా పొదుపు మహిళలు చెల్లిస్తున్న రుణాలను బ్యాంక్‌లో జమ చేయకుండా యానిమేటర్ స్వాహా చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆరోపణలపై ఏపీఎం జోయబాబును వివరణ కోరగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓంకార్ గ్రామ సమాఖ్యలో అక్రమాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

వీధి వ్యాపారులపై అధికారుల ఆంక్షలు తగదు



సరుకును రోడ్డుపై పోసి నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్లతో, బుట్టలతో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న తమపై మున్సిపల్ అధికారుల ఆంక్షలు తగవంటూ చిరువ్యాపారులు రోడ్డెక్కారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్ ప్రాంతంలో తోపుడు బండ్లు, బుట్టలతో వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులను మున్సిపల్ అధికారులు వ్యాపారం చేయవద్దంటూ ఆదేశించడంతో ఆందోళన చోటుచేసుకుంది. కూరగాయలు, పండ్లు రోడ్లపై పారబోసి చిరువ్యాపారులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించుకుని పెద్దపెద్ద షాపులను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకునేవారు మున్సిపల్ అధికారులకు కన్పించడంలేదా అని ప్రశ్నించారు. తోపుడు బండ్లతో ఎవరికీ ఇబ్బంది లేకుండా చిరువ్యాపారాలు చేసే మాపైనే ఆంక్షలు విధించడం అన్యాయం అన్నారు. ఇదిలా ఉండగా, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లకు అడ్డంగా బండ్లను పెట్టి వ్యాపారం చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనీ, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

57,107 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 60,801 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 57,107 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 35,638 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	8000	13000
నెంబరు. 5	8000	12500	నెంబరు. 5	8500	8500
273	9000	12000	273	10800	12000
341	8000	15000	341	8500	14000
4884	10000	12500	4884	9500	14500
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16800	తేజ	8000	16500
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	9000	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 23,87,102

దుర్గి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.23,87,102లు ఆదాయం సమకూరినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో సైదమ్మ బాయి తెలిపారు. 63 రోజులుగా భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలుగా చెప్పారు. పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సీహెచ్ శివనాగిరెడ్డి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

పాఠశాలల వేళలు మార్చటం తగదు

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుభానీ

సత్తెనపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పని వేళల విధానాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని వేళలు పెడతామని ప్రభుత్వం చెప్పటం విడ్డూరంగా ఉందని ఎస్టీయూ(ఏపీ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది అశాస్త్రీయ విధానమని, ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు కోడై కోస్తున్నా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. పాఠశాలల పనివేళలు మార్చి విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహానికి ప్రభుత్వం గురి కావద్దని ఆయన కోరారు.

రామారావుకు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న రామారావు

కారంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలోని వెంకటేశ్వర స్వామి పద్మావతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వాసవీక్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన సభలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ పల్నాడు జిల్లా 204ఏ అవార్డును కారంపూడి వాసవీ క్లబ్ వైస్ గవర్నర్లు భవిరిశెట్టి రామారావు, ముచ్చర్ల రామకోటేశ్వరరావులు అందుకున్నారు. ఈ సందర్భంగా రామారావు, రామకోటేశ్వరరావులకు మండల ఆర్యవైశ్య నేతలు అభినందనలు తెలిపారు.

జిల్లా సమాఖ్య కోశాధికారిగా నాగలక్ష్మి

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాఖ్య కోశాధికారిగా అమరావతి మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మి ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. మంగళవారం జరిగిన జిల్లా సమాఖ్య కార్యవర్గ ఎన్నికలో నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రైమ్ జోన్

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని తాలూకా సెంటర్లో బుధవారం రాత్రి జరిగింది. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఒంటిపులి కాటిస్వామి(40), తేనె అంకమ్మలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాటి స్వామి మేడికొండూరు మండలం పాలడుగులో చర్చి నిర్మించుకొని పేరు అబ్రహంగా మార్చుకొని పాస్టర్‌గా జీవిస్తున్నాడు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. అప్పట్లో పెద్ద మనుషులు భార్యాభర్తలకు సర్ది చెప్పటంతో కలసి జీవిస్తున్నారు. మూడు నెలల క్రితం వారిమధ్య గొడవలు ఎక్కువై అంకమ్మ సత్తెనపల్లి రూరల్ పోలీసుస్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. భార్యాభర్తల విషయం కావటంతో పెద్ద మనుషుల్లో తేల్చుకోవాలని రూరల్ పోలీసులు చెప్పటంతో పెద్ద మనషుల సమక్షంలో అంకమ్మకు నెలకు రూ.5వేలు నగదు కాటిస్వామి ఇచ్చేలా ఒప్పందం చేశారు. ఐతే ఈనెల ఇవ్వాల్సిన రూ.5వేలు నగదు కాటిస్వామి ఇవ్వకపోవటంతో అంకమ్మ మరలా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కాటిస్వామిని రూరల్ పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. పెద్దల సమక్షంలోనే మాట్లాడుకోవాలని సూచించారు. ఐతే పెద్దలు కాటిస్వామిని తీవ్రంగా దుర్భాష లాడటంతో తన వెంట ద్విచక్ర వాహనంలో తెచ్చుకున్న పురుగుమందును తాలూకా సెంటర్లోనే తాగాడు. కుటుంబసభ్యులు ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. పెద్దలు దుర్భాష లాడటం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మాచర్లటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డులో ఓ పేకాట స్థావరంపై బుధవారం పట్టణ సీఐ ప్రభాకరరావు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.21,200లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు.

13 మద్యం బాటిల్స్ స్వాధీనం

పెదకూరపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలంలోని ధరణి కోటలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 13 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పెదకూరపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయిని మృతి

దాచేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం కేశానుపల్లిలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న దాసరి విజయలక్ష్మి(44) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. కొంతకాలంగా విజయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. ఆమె ఆకస్మికంగా మృతి చెందడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు సంతాపాన్ని తెలియజేశారు.

అధ్వానంగా హిందూ శ్మశాన వాటిక

● చితిని పేర్చుకునేందుకు సక్రమంగా స్థలం కూడా లేదు
● చెత్తాచెదారంతో నిండి దుర్వాసన భరితం
● అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులకు వినతిపత్రాల అందజేత.. స్పందించని తీరు



చెత్తాచెదారం నిండి ఉన్న హిందూ శ్మశాన వాటిక

అచ్చంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని హిందూ శ్మశాన వాటిక అధ్వాన స్థితికి చేరుకుంది. కనీసం శ్మశానంలో కర్మకాండలు జరిపించుకొనేందుకు ఎలాంటి రూము లేకపోవటంతో పాటు చితిని పేర్చుకొనేందుకు సక్రమంగా స్థలం కూడా లేకపోవటం దురదృష్టకరంగా భావిస్తున్నారు. గ్రామంలో మృతి చెందిన ప్రతి హిందూ మృతదేహాన్ని ఇక్కడకు తరలించాల్సిందే. కావాల్సినంత స్థలం ఉన్నప్పటికీ పారిశుద్య చర్యలు లేక పోవటంతో ఈ స్థలం చెత్తాచెదారంతో నిండి ఉంది. శ్మశాన వాటిక వద్దకు వచ్చిన వారు ఇక్కడ దుర్వాసనకు ఉండలేక క్షణాల్లో వెళ్లిపోతున్నారు. ఉమ్మడి ప్రయోజనం కోసం ఏ నాయకుడు కూడా సక్రమమైన చర్యలు చేపట్టడం లేదు. శ్మశానం అభివృద్ధి చేయాలని ఇప్పటికే ఎన్నో సార్లు అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులకు కూడా విన్నవించారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అచ్చంపేటలో అనేక మంది నాయకులు ఉన్నప్పటికీ అభివృద్ధిపై చర్యలు చేపట్టక పోవటంతో అనేక విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అన్నదాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి



సేద్యపు విభాగంలో ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దుర్గి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే అన్నదాతలు ఆనందంగా ఉండాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మండలపరిధిలోని ధర్మవరంలో ఉన్న బాలనాగేంద్రస్వామి 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన సేద్యపు విభాగం ఎడ్ల బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో వార్షిక వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని అన్నారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలు కాకూడదనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. మధ్యలోనే నిలిచిపోయిన ధర్మవరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొట్టు కోటేశ్వరరావు, లక్ష్మణ, గుండాల వెంకటేశ్వర్లు, పులి హరి, తిక్కా కొండలు, కోటేశ్వరరావు, సుబ్బారావు, నక్షత్రపు ప్రసాద్, తోటకూర శ్రీనివాసరావు, యలమంద తదితరులు పాల్గొన్నా రు.

బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం

సేద్యపు విభాగంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో 9 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజాశ్రీరెడ్డి ఎడ్లజత నిర్ణీత వ్యవధిలో బండను 5611.07 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే నంద్యాల జిల్లా, పెదకోటాలకు చెందిన బొర్రెడ్డి కేశవరెడ్డి ఎడ్లజత 5365.02 అడుగులతో రెండో స్థానం, గుంటూరు జిల్లా, మేడికొండూరుకు చెందిన శ్రీనివాసరావు, విజయ్ పవన్‌కుమార్ ఎడ్లజత 4761 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా కొమేరపూడికి చెందిన ఏసుబాబు చౌదరి ఎడ్లజత 4750 అడుగులతో నాలుగోస్థానం, కృష్ణా జిల్లా తేంపల్లెకు చెందిన కోలుసు శ్రీనివాసరావు ఎడ్లజత 4567.06 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. గురువారం ఆరు పళ్ల విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.3 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వెన్నా సాంబశివారెడ్డి

బెల్లంకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థాన సమీపంలో రూ.3 కోట్ల నిధులతో స్వయంభూ దేవాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి భూమిపూజ బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల కరస్పాండెంట్ అండ్ డైరెక్టర్, కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి వెంకట సాంబిరెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు కేటాయించటం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు. కేతవరం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినదని ఆయన అన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం భూమి పూజా నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాశం పెద నరసింహారెడ్డి, దేవదాయ శాఖ ఈవో వెంకటేశ్వరరెడ్డి, ఆలయ నిర్మాణ దాత సాంబిరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు తనిఖీ

సత్తెనపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కళాశాలల బాలి కల వసతి గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. 250 మందికి గాను ఒకే మరుగుదొడ్డి ఉందని, మిగిలినవి సెప్టిక్ ట్యాంకులు నిండి నిరుపయోగంగా ఉండటం వల్ల ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థినులు ఆమెకు తెలిపారు. వసతి గృహ పరిసరాల్లో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని, నాసిరకమైన కూరగాయలతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమశాఖ అధికారి పర్యవేక్షణ లోపం వల్ల వంట మనుషులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. విద్యార్థినులు స్వేచ్ఛగా తమ సమస్యలను చెప్పే హక్కు లేకపోవటం బాధాకరమని పద్మావతి అన్నారు. వసతి గృహంలో నెలకు ఒకసారి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్య పరీక్ష లు నిర్వహించాలని స్థానిక వైద్యులకు సూచించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో, వారి తల్లిదండ్రులతో ఆమె వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విద్యార్థినులు రాత పూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం సంఘటనను బాలల హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తుందని తెలిపారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆమె కోరారు. వసతి గృహంలోని ఆహార పదార్థాలను కూడా ఆమె పరిశీలించారు. ఆమె వెంట పట్టణ సీఐ బ్రహ్మం, ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్‌డబ్ల్యూవో నిరీక్షణ కుమారి, సీడీపీవో శ్రీలత, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జనకు దూరంగా ఉండాలి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



దొడ్లేరులో నిర్వహించిన మరుగు దొడ్ల దినోత్సవ ర్యాలీ

మాచర్లటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జనకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మాచర్ల పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

● కారంపూడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ కసిన్యానాయక్ అన్నారు. కారంపూడిలో నిర్వహించిన మరుగుదొడ్డి అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దొడ్లేరులో మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ

క్రోసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారని శిఖా శ్యామ్‌సన్ ఈ సందర్భంగా ప్రతిఒక్కరు మరుగుదొడ్లు వాడటంతో పాటు పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఆరోగ్య కార్యకర్త అనుపమ, సీహెచ్‌వో ధనరేఖ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ర్యాలీలో పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రంలోనే పత్తిని అమ్ముకోవాలి

● వ్యవసాయ అధికారి రామమ్మ

మాచవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్ని గ్రామాల రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి రామమ్మ ఆయా గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తేమశాతం ఆధారంగా పత్తి కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ యాకూబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ



పేషెంట్ల వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ బి.రవి

రాజుపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి బుధవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రవి కాన్పుల గదిని, రక్తపరీక్షల గదిని, ఫార్మసీ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఓపీఏసీకి వచ్చే ప్రతి పేషెంట్స్‌ని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు యాప్‌లో నమోదు చేయాలని, ఎన్‌డీసీడీ 3.0 ఆరోగ్య సర్వే జరుగుతున్న తీరును గూర్చి స్థానిక వైద్యులు రవితేజ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హనుమకుమార్, సిబ్బంది ఉన్నారు.

కౌలు రైతులకు రుణాలు..

● ఏడీఏ జగదీశ్వరరెడ్డి

రెంటచింతల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు గుర్తింపు కార్డు పొందిన ప్రతి రైతూ బ్యాంకుల్లో రుణాలు పొందొచ్చని మాచర్ల ఏడీఏ జగదీశ్వరరెడ్డి అన్నారు. బుధవారం తుమ్మకోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులున్న రైతులు బ్యాంకుల్లో రుణం పొందవచ్చని రైతుసేవా కేంద్రం సిబ్బంది ఈ విషయాన్ని కౌలు రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి


అచ్చంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని అచ్చంపేట కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు సందెపోగు వెంకయ్య కార్యదర్శి బొజ్జా నీలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు కళాకారులకు కార్డులు మంజూరు చేశారని, ఆ కార్డులను పునరుద్ధరించాలని కోరారు. కళాకారుల కార్డుల ద్వారా అనేక రంగాల్లో గుర్తింపు పొందామని కోరారు. కళాకారులకు ప్రత్యేక పింఛన్లు కూడా తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చారని వారు అన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

● రైతు కూలీ సంఘం జిల్లా నేత పద్మ

కారంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఈనెల 26వ తేదీన జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా నేత జె.పద్మ పిలుపునిచ్చారు. బుధవారం కారంపూడిలో మహాధర్నాపై ప్రచారం నిర్వహిస్తూ ర్యాలీ జరిపి బస్టాండ్ సెంటర్ వద్ద ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజల జీవన విధానం దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో నీలాద్రి రాంబాబు, కొండారెడ్డి, చెన్నయ్య, రామ్మూర్తి, శ్రీనివాసరెడ్డి, సైదారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



దుర్గిలో గ్రంథాలయ వారోత్సవాల బహుమతులు అందుకున్న విద్యార్థులు

మాచర్లటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానం, సంస్కారం లభిస్తాయని పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మికుమారి అన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువ సమయం గ్రంథాలయంలో గడపాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.శ్రీనివాస్, ఎస్ చిన చెన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దుర్గి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో ఈనెల 14వ తేదీన ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా హాజరైన జడ్పీటీసీ యలమంద, ఎంపీడీవో శివప్రసాద్, విశ్రాంత ఎంఈవో వీరయ్యచౌదరిలు బహుమతులు అందించారు.

గురజాలటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయం లో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, రంగోలి, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారి హిమభార్గవి పోటీలను పర్యవేక్షించారు.

● క్రోసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, గ్రంథాలయ శాఖ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

● అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమరావతి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆర్‌వీవీఎన్ కళాశాల కరస్పాండెంట్ చేకూరి జాజిబాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి గ్రంథా లయాధికారి వెంకాయమ్మ అధ్యక్షత వహించారు.

● మాచవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయా పాఠశాలల్లో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కాలర్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

● రాజుపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో జీవి సత్యానారాయణ వారోత్సవాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఏజీఎల్ కనెక్షన్‌లో అలసత్వాన్ని వీడాలి

● పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్

ఫటా ఫట్



పిడుగురాళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు 24/7 నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ పనిచేస్తుందని పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయకుమార్ తెలిపారు.

ప్ర: జిల్లాలో విద్యుత్ బకాయిల వసూళ్లకు ఏమి చేస్తున్నారు ?

జ: మండలాల వారీగా విద్యుత్ బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

ప్ర: గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు ?

జ: గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ బిల్లులు వసూలు చేయించడంతో పాటు, విద్యుత్‌ను డైవర్షన్, మీటర్ లేకుండా విద్యుత్‌ను వాడుకునే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: గ్రామీణ ప్రాంతాల్లో ఏజీఎల్ కనెక్షన్లు ఇస్తున్నారా ?

జ: పల్నాడు జిల్లా వ్యాప్తంగా రైతులు వ్యవసాయ పొలాల్లో ఏజీఎల్ కనెక్షన్ల కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అట్టి దరఖాస్తులను త్వరగా విచారించి రైతులకు సత్వరమే ఏజీఎల్ కనెక్షన్ అందిస్తున్నాం.

ప్ర: పల్నాడులో ఏజీఎల్ కనెక్షన్ల మంజూరులో అధికారుల పని తీరుపై విమర్శలు వున్నాయా ?

జ: గ్రామీణ ప్రాంతాల్లో ఏజీఎల్ కనెక్షన్ల మంజూరులో కొందరు సిబ్బంది రైతుల నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల మేరకే రైతులు తగిన రుసుం చెల్లించాలే తప్ప ఏజీఎల్ కనెక్షన్ల మంజూరులో డబ్బులు డిమాండ్ చేస్తే తన దృష్టికి తీసుకురావాలి.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య

సత్తెనపల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై దళిత గిరిజనులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. ఏపీ సీఐడీ ఆధ్వర్యంలో మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు అగ్రవర్ణాల చేతుల్లో వివక్షకు గురైతే వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వివక్షకు గురైనప్పుడు హక్కులను ఎలా వినియోగించుకోవాలి?, ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన నష్ట పరిహారం పొందటం ఎలా?, వివక్షకు గురవ్వటం అంటే ఏంటి తదితర అంశాల ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అమీరుద్దీన్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి : ఏడీఏ



ఎరువుల గిడ్డంగుల్లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ హనుమంతరావు

బెల్లంకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని క్రోసూరు ఏడీఏ హనుమంతరావు తెలిపారు. బుధవారం బెల్లంకొండలో ఎరువుల గిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే ఎరువులను విక్రయించాలని అలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● నకరికల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుమతి ఉన్న విత్తన దుకాణదారుల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని ఏవో కే దేవదాసు రైతులకు సూచించారు. కొను గోలు చేసిన రైతులు రసీదులపై కొనుగోలుదారు సంతకం, రైతు సంతకం ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

పుట్టిన ఊరుకు నా సహకారం ఎల్లప్పుడు ఉంటుంది

● హైదరాబాద్ జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ అత్తోట మురళీ ముకుంద్



మాట్లాడుతున్న మురళీ ముకుంద్

పెదకూరపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల దేవాలయం లాంటిదని, ఆ పాఠశాలకు సేవ చేయటం నా పూర్వజన్మ సుకృతమని ప్రముఖ విద్యావేత్త, హైదరాబాద్ జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ అత్తోట మురళీ ముకుంద్ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం రూ.50వేలు టేబుల్ టెన్నిస్ బోర్డు, టేబుల్ టెన్నిస్ బ్యాట్‌లు, బాల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టెన్నిస్ పోటీలను ఆయన ప్రారంభించారు. రాబోయే రోజుల్లో జడ్పీ హైస్కూల్లో గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామని, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌తో అధునాతన రీతిలో అన్ని రకాల అవకాశాలను కల్పి స్తామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మేడా రామకృష్ణ, రాయపూడి సాంబశివరావు, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ వెంకట నాగరాజులు మాట్లాడుతూ ఇప్పటికీ లక్షలాది రూపాయల విలువ చేసే ఫర్నిచరును, క్రీడా సామగ్రిని అందించి గొప్పమనస్సు చాటుకున్న మహోన్నత వ్యక్తి మురళీ ముకుంద్ అన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వ్యాపారవేత్తలు లక్ష్మణరావు, శ్రీధర్, పవనం మల్రెడ్డి, జే నరేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీగీతా వెంకటేశ్వర వేదపాఠశాల ప్రారంభం



వేదపాఠశాల ప్రారంభ కార్యక్రమంలో హోమం నిర్వహిస్తున్న సత్యనారాయణ అవధాని

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్య క్షేత్రమైన అమరావతిలోని పెద్దింటమ్మ ఆలయ సమీపంలో శ్రీగీతా వెంకటేశ్వర వేద పాఠశాలను బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపక నిర్వాహకులు ఘంటసాల చంద్రమౌళిశర్మ పాఠశాల విద్యార్థులతో కలసి తన స్వగ్రామమైన యండ్రాయి నుంచి పాదయాత్రగా అమరావతి చేరుకుని నూతన భవనాన్ని ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన భవనంలో వేదపాఠశాలను ఏర్పాటు చేసి ఉచితంగా పేద బ్రాహ్మణ విద్యార్థులకు వసతితో పాటు వేదాలను బోధి స్తారు. ప్రారంభ కార్యక్రమం బ్రహ్మశ్రీ అంబడిపూడి సత్యనారాయణావధాని పర్యవేక్షణలో జరిగింది. ప్రతిరోజు వేదపాఠశాలలో అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని చంద్రమౌళి శర్మ తెలిపారు. కార్యక్రమంలో వేదపాఠశాల గురువు జి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పై అవగాహన

రాజుపాలెం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హజరైన కోటిరత్నం మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు శివకుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేప టి పౌరులని వారందరూ దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



మత్స్య విలాపం!

- కాలుష్య కోరలతో అంతరించిపోతున్న విశిష్ట మత్స్యజాతులు
- ఎగుమతుల్లోనూ వెనకడుగే
- వైసీపీ పాలనలో మత్స్యకారులపై నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో గంగపుత్రుల సంక్షేమం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం





సముద్రంలో ఉండే విశిష్ట మత్స్య సంపద కాలుష్యం దెబ్బకు అంతరించి పోయే ముప్పును ఎదర్కొంటోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడానికి తోడు పారిశ్రామిక వ్యర్థా లకు కూడా సముద్రమే అంతిమ మజిలీ కావడంతో ఎన్నోరకాల మత్స్యజాతులు అరుదైన జాతి కోవలోకి చేరిపోయాయి. ఈ క్రమంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గడచిన ఐదేళ్లలో ఈ విచ్చలవిడి తనం పతాకస్థాయికి చేరుకోవడంతో మొత్తం మత్స్య రంగమే ప్రమాదంలో పడే విలపించే స్థితికి చేరుకుంది. ఇక, మత్స్యకారుల గురించి చెప్పాలంటే సముద్రంలో చేపల వేటే వారి వృత్తి. నెలలో ఇరవై రోజులు గంగమ్మతోటే వారి ప్రయాణం. ఆటుపోట్లు, గంగమ్మ ఉరకలు, తుఫాన్ హెచ్చరికలు ఇవేవీ కడలితో వారికి ఉన్న బంధాన్ని తెంచలేవు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడుతున్నా వారి జీవనప్రమాణాలు మాత్రం మెరుగుపడడం లేదు. గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులతో పాటు ఆ రంగం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న వారు దాదాపు 50,000 మంది వరకు ఉంటారు. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఈ సంఖ్య 20,000 ఉండటం గమనార్హం. ముఖ్యంగా చీరాల, చినగంజాం, రేపల్లె, బాపట్ల తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఉంటారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కార్యక్రమం కూడా మత్స్యకారుల కోసం చేపట్టక పోవడం గమనార్హం. ప్రతి ఏటా చేపల వేట నిలుపుదల చేసే రెండు నెలల కాలానికి మాత్రం అరకొరగా మత్స్యకార భరోసా పథకం కింద జమ చేసి 'మమ' అనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'భరోసా'కు అర్హులైన వారే దాదాపు 25,000 మంది వరకు ఉండగా, 12,000 మంది ఖాతాల్లో మాత్రమే జమ చేసి గంగపుత్రులకు అన్యాయం చేసిన ఘనత వైసీపీది.

'హామీ' నిలబెట్టుకుని భరోసా పెంచాలి

ఎస్. అనిల్ కుమార్, జిల్లా ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీస్ వైస్ చైర్మన్



వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ. 20,000 కు పెంచుతామని ఎన్నికలకు ముందు చెప్పినట్లుగానే అమలు చేయాలి. గత ప్రభుత్వంలో అర్హులైన చాలా మంది మత్స్యకారులకు 'భరోసా' విషయంలో న్యాయం జరగలేదు. ఇప్పుడు అందరికీ పరిహారం అందేటట్లు చూడాలి. సొసైటీలను బలోపేతం చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలి.

పురోగమింప చేయడానికి తీసుకోవాల్సినవి

చేపల పెంపకానికి అనువైన చెరువులను గుర్తించే ప్రక్రియ 2014-19 మధ్య ముమ్మరంగా జరి గింది. కానీ తర్వాత గద్దెనెక్కిన వారు పట్టించుకోవడమే మానేశారు. ప్రస్తుతం వాటిని గుర్తించ డంతో పాటు నీటి వనరులను కూడా కల్పించడం కూటమి ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. మత్స్యకార సొసైటీలను అన్ని విధాలుగా గత ప్రభుత్వం కుదేలు చేసింది. ఇప్పటికే సొసైటీలకు ఎన్నికలు జరిపే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టింది. సహకార సంఘాలకు పూర్వ వైభవం దక్కే విధంగా ప్రభుత్వం వైపు నుంచి చేయూత అందించి నిలదొక్కుకునే అవకాశం కల్పించడం ప్రాధాన్యంగా చేయాల్సి ఉంది.

ఎగుమతులపై దృష్టి పెట్టాలి

గడచిన ఐదేళ్లలో ఎగుమతులలో జిల్లా వాటా పడిపోతూ వస్తోంది. 86 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం ఉన్న జిల్లాలో దాదాపు 3,000 వరకు వేట పడవలు ఉన్నాయి. ఏటా 850 టన్నుల వరకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేసేవారు. కానీ గడచిన ఐదేళ్లలో అవలంభించిన అస్తవ్యస్త విధానాలతో ఇది కాస్తా 600 టన్నులకు పరిమితమైనట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. సముద్రంలో చేపల సంఖ్య భారీగా తగ్గడంతో గిట్టుబాటు కావడం లేదని మత్స్యకారులు వాపోతున్న ఉదంతాలు కోకోల్లలు. ప్రస్తుతం కేంద్రం నుంచి కూడా సహకారం అందుతుండడం వల్ల వీలైనన్ని చేపల అనుబంధ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

వ్యర్థాలు సముద్రంలో కలవకుండా చూడాలి

సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు వాటి వ్యర్థాలను సముద్రంలో కలపడం ద్వారా పెద్ద ఎత్తున మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపదకే కేంద్రంగా ఉండే నదులు, వాగులు, చెరువులను కాలుష్యం ఓ వైపు కమ్మేస్తుంటే, మరో వైపు ఆక్రమణలు శాపంగా మారాయి. నాలుగేళ్ల కిందట కేంద్రం ప్రారంభిం చిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జిల్లాలో అమలైన దాఖలాలే కనిపించలేదు. ఈ పథకం కింద మత్స్యసం పదను పెంచేవిధంగా కార్యాచరణ రూపొందిం చడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ముం దుకెళ్లడం దీనిలోని ప్రధాన అంశం. కానీ ఆ దిశగా రాష్ట్రం చొరవ తీసుకోకపోవడంతో ఆ నిధులు కూడా నిరుప యోగమైనట్లు సమాచారం.

వాతావరణ మార్పులతో ఒడిదుడుకులు

ఇక వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు కూడా మత్స్యరంగం ఒడిదుడుకులుకు కారణంగా ఉంది. కొవిడ్ తర్వాత ఎగుమతులపై ఆంక్షలు పెరగడంతో పాటు నాణ్యత విషయం లోనూ కఠినమైన ఆంక్షలను అంతర్జాతీయంగా ఎదుర్కోవాల్సి రావడం కూడా ఈ రంగానికి గొడ్డలి పెట్టులా తయారైంది. మత్స్యకారుల సంక్షేమమే తొలి ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. కడలిని వ్యర్థాలకు ఆవాసాలుగా మారకుండా చూసి మత్స్య సంపదను కాపా డాల్సిన గురుతర బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఐదేళ్ల బాలారిష్టాలకు స్వస్తి చెబుతూ భవిష్యత్తులో మత్స్యరం గాన్ని పురోగమన బాట పట్టించే విధంగా ప్రపంచ మత్స్య దినోత్సవం రోజు పాలకులు ప్రతినబూని అందుకు తగ్గ కార్యాచరణ రూపొందిం చాల్సిన అవసరం ఉంది.

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇదికూడా జరుగుతోంది. ఆ జాబితా పరిశాలన కూడా ఏకకాలంలోనే జరుగుతోంది. ఇది కాక ప్రతి సంవత్సరం కొత్త ఓట్ల చేరికలకు సంబంధించి 2025 జనవరి 5 నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తిచేసేలా స్పెషల్ సమ్మరీ రివిజన్ కూడా జరుగుతోంది. వీటన్నిటికీ వీఆర్‌ఓలు బీఎల్‌ఓ హోదాలో హాజరు కావలసిందే. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలుగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో వీఆర్‌ఓలనే నియమిస్తారు. వారు చాలకుంటే ఇతర శాఖల సిబ్బందిని కూడా బీఎల్‌ఓలుగా తీసుకునే అధికారం ఉండటంతో ఇతర సిబ్బందినికూడా దీనికి ఉపయోగిస్తున్నారు. ఇదిట్లా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం హౌస్‌హోల్డ్ సర్వే చేపట్టింది. దీనికి ఇప్పటికే సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సర్వే వేగవంతం కావటంలేదనే వత్తిడి కూడా ప్రభుత్వం నుంచి వస్తుండటంతో చాలా మండలాల్లో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందినే కాకుండా వీఆర్‌ఓలను కూడా సర్వే విధులకు పంపుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ సమన్వయంతో ఉన్న మండలాల్లో వీరి సమస్య పెద్దగా లేకు న్నా, కొన్నిమండలాల్లో మాత్రం అగ్గి రాజుకుంటోంది.

అడకత్తెరలో.. వీఆర్వోలు

వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చుతో...

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధంచేసి పంపే అధికారం ఆయా మండలాల తహసీల్దార్‌లకే ఉండేది. అయితే వైసీపీ సర్కారు వచ్చాక దీనిలో తీవ్ర గందరగోళ పరిస్థితిని తీసుకొచ్చింది. వీఆర్‌ఓల వేతనాలు వేసే అధికారం ఎంపీడీఓలకు అప్పగించారు. అయితే ఇక్కడా మరో మెలిక ఉంది. వీఆర్‌ఓలలో గ్రేడ్-1, గ్రేడ్-2 అనే రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్‌ఓలను గ్రేడ్-1 కింద ఉంచి, వారికి జీతం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్ధతినే ఉంచేస్తే, వీఆర్‌ఏలు, ఇతర శాఖల నుంచి ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్‌ఓలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీఓలు వేతనాలు వెయ్యాల్సి ఉంటుంది. అటు సచివాలయంలోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికీ ఎంపీడీఓలే వేతన బిల్లులు పంపాల్సి ఉంటుంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే తాజాగా పెరిగిన పని వత్తిడి కారణంగా ఎవరికివారు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ వారికి విధులు అప్పగించేస్తున్నారు. అయితే రెండు చోట్ల విధులకు హాజరు కాలేక సతమతమవటం వీఆర్‌ఓల వంతవుతోంది. ఈ తరహా అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా ఇప్పుడు శాఖల మధ్యే సమన్వయం లోపించటానికి, వారి మధ్య వివాదాలకు కారణమవుతోంది. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, పెదనందిపాడు, అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈ వ్యవహారం తారాస్థాయికి చేరితే, మరికొన్నిచోట్ల సర్దుకుపోతూ, పని వత్తిడి వచ్చినప్పుడు బయటపడుతూ వస్తున్నారు. తెనాలి, మరికొన్నిచోట్ల వీఆర్‌ఓలపై తహసీల్దార్‌లు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలనా విధులకు రావాలని తెగేసి చెబుతుంటే, ఎంపీడీఓలు తాము చెప్పిన విధులకు రాకుంటే మెమోలే జారీ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వీఆర్‌ఓలు ఆరోపిస్తున్నారు. తెనాలిలో ఇప్పటికే ముగ్గురుకి మెమోలు ఇస్తే, ఒకరి వేతనం ఆపుతామని బెదిరించారని, నెలనెలా వచ్చే జీతంతో బతికేవారిపై ఇటువంటి బెదిరింపులకు దిగితే ఎట్లాగంటూ వారూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వీఆర్‌ఓల సంఘంలో ఈ వివాదాన్ని పెట్టి తేల్చుకుంటామంటూ వారూ తగ్గకుండా హెచ్చరికలు చేయటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఇదిట్లాఉంటే గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల వీఆర్‌ఓలు మాత్రం ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళితే, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలెక్టర్‌కు విన్నవించుకుని, ఫలితం కనిపించకపోతే, ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. ఇదిట్లాఉంటే... కొందరు తహసీల్దార్‌లు ఏకంగా సీఎం దగ్గరకు ఈ గందరగోళాన్ని తీసుకెళ్లి సరిదిద్దాలని కోరే ఆలోచనలో ఉంటే, మరోపక్క ఎంపీడీఓలు కూడా రాష్ట్ర మంత్రి లోకేష్ దగ్గరకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన మార్పులవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

పొన్నెకల్లు జడ్పీస్కూల్ పీఈటీ సస్పెన్షన్

● పాఠశాల హెచ్‌ఎంకు చార్జిమెమో జారీ

గుంటూరు(విద్య),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం పొన్నెకల్లులోని డీవీకేఆర్ జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి షేక్ సమీర్ మరణించిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల పీఈటీ వై రాజారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల డ్రిల్ సమయంలో 9మంది విద్యార్థులు గోడదూకి బయటకు వెళ్లారు. వారు మరో విద్యార్థి సమీర్‌తో కలిసి ఈతకు వెళ్ళారు. సంఘటనలో సమీర్ బావిలో పడి మరణించిన విషయం తెలిసిందే. దీనికి పీఈటీ నిర్లక్ష్యమే కారణమని డిప్యూటీ డీఈవో ఇచ్చిన నివేదికతో పీఈటీ రాజారెడ్డిని విధులు నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు. అదేవిధంగా పాఠశాల హెచ్‌ఎం జరీనా ముంతాజ్‌బేగంపై చార్జీమెమోను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి జారీ చేశారు. హెచ్‌ఎం నుంచి వచ్చే సమాధానం ఆధారంగా విచారణ జరిపి ఆమెపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ స్పష్టం చేశారు.

రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో వేసిన బెయిల్ పిటిషన్లు డిస్మిసయ్యాయి. బెయిల్ కోసం బోరుగడ్డ తరఫున దాఖలైన రెండు పిటిసన్లపై విచారించిన ఐదో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లత వాటిని డిస్మిస్ చేస్తూ బుధవారం ఆదేశాలిచ్చారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులు నమోదు కాగా పోలీసులు పిటి వారెంట్లపై ఆయా కోర్టులలో హాజరు పరుస్తున్నారు.

వెనుతిరిగిన పట్టాభిపురం పోలీసులు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పిటి వారెంట్‌పై మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వెళ్ళిన పట్టాభిపురం పోలీసులకు నిరాశే ఎదురైంది. అనంతపురం జిల్లాలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు పిటి వారంట్‌పై కేంద్ర కారాగారంలోనే కస్టడీలోకి తీసుకుని జూమ్ యాప్ ద్వారా వర్చువల్‌గా సంబంధిత మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అయితే పట్టాభిపురం పోలీసుల వారెంట్ గడువు బుధవారంతో ముగియడంతో వారు వెనుతిరిగారు.

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ

గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా తుళ్లూరు పోలీసులు రౌడీషీటర్ బోరుగడ్డ విషయంలో కాస్తంత కటువుగానే వ్యవహరించారు. బోరుగడ్డను రెండు కేసుల్లో రెండు రోజులు పాటు కస్టడీకి అనుమతిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాజమహేంద్రవరం నుంచి తుళ్లూరు తీసుకువచ్చి తిరిగి కోర్టులో హాజరు పరచడానికే సమయం సరిపోతుందని, విచారణకు సమయం చాలదని పోలీసులు కోర్టును అభ్యర్థించడంతో కస్టడీ సమయాన్ని పొడిగించారు. దీంతో తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోరుగడ్డను రెండు రోజుల పాటు విచారించారు. విచారణ సమయంలో ఆయనను లాకప్‌లోనే ఉంచారు. చివరకు మధ్యాహ్న భోజనం కూడా లాకప్‌లోకే అందించారు. కూర్చునేందుకు ఇనుప కుర్చీ ఇవ్వడంతో పాటు సాధారణ ఖైదీలు వెళ్లే బాత్రూం వినియోగించేలా చూశారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సందర్భంగా తుళ్లూరుకు రెండు కార్లలో వెళ్లి అక్కడ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిపై దౌర్జన్యం, దానిని చిత్రీకరిస్తున్న ఏబీఎన్ విలేకరిపై దాడితో పాటు దాబా హోటల్‌లోని సిబ్బందిని కత్తులతో బెదిరించి దౌర్జన్యం చేసిన ఘటనలపై బోరుగడ్డపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో బోరుగడ్డతోపాటు మరో నలుగురు వరకు పాల్గొన్నట్లు అప్పట్లో పోలీసులు గుర్తించారు. అయితే వారు ఎవరనేది తాజా విచారణలో బోరుగడ్డ నుంచి ముగ్గురి వివరాలు రాబట్ట గలిగారు. తన కారు డ్రైవర్ లాం గిరి, బంధువు సమర్పన్, రాజారావు తనతో పాటు పాల్గొన్నట్లు బోరుగడ్డ పోలీసులకు చెప్పాడు. బోరుగడ్డ చెప్పిన ముగ్గుర్ని అరెస్టు చేయాల్సి ఉంది. తనకు సయాటికా ఉందని విచారణకు అవకాశం ఇవ్వరాదని బోరుగడ్డ మేజిస్ట్రేట్‌కు సూచించగా అసలు సయాటికా ఎక్కడ వస్తుంది అని మేజిస్ట్రేట్ ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో విచారణ సందర్భంగా పోలీసులకు, కోర్టులకు సహకరించాలని మెజిస్ట్రేట్ ఆదేశించడంతో అలాగేనంటూ తల ఊపుతూ బోరుగడ్డ వెనుతిగాడు. అయితే బోరుగడ్డ రెండు రోజుల విచారణలో పోలీసులకు సహకరించలేదని తెలిసింది. మొదటి రోజు చెప్పిన సమాధానాలకు రెండో రోజు చెప్పిన సమాధానాలకు పొంతన లేదని సమాచారం.

ముసాయిదా ముద్రణకు సిద్ధం

- పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం
- బుధవారం సాయంత్రానికి 5 శాతమే పెండింగ్
- ఓటు కోసం 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు
- 23న డ్రాఫ్టు లిస్టు విడుదల చేస్తామన్న ఈఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నిక కోసం జరుగుతోన్న ఓటరు నమోదు ప్రక్రియ ముసాయిదా జాబితాల ప్రచురణ దశకు చేరుకున్నది. నోటిఫికేషన్ ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పేర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణకు చర్యలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుల పరిష్కారానికి సమయం ఉండటంతో పెండింగ్‌లో ఉన్న 5 శాతం కూడా క్లియర్ చేసి డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రిం టింగ్‌కు పంపుతామని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి తెలిపారు. ఈసీ ఆమోదంతో ఈ నెల 23న తుది ఓటర్ల జాబితాని ప్రచు రించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు హార్డ్/సాఫ్ట కాపీలను అందజేస్తామన్నారు. పట్టభద్రులు ఈ దఫా ఓటరు నమోదులో ఎక్కువగా ఆన్‌లైన్ సర్వీసులను వినియోగిం చుకున్నారు. ఈసీఐ వెబ్‌సైట్ ద్వారా ఫారం-18లను పంపించారు. బాపట్ల జిల్లాలో 21519, ఏలూరులో 14709, గుంటూరులో 91013, కృష్ణాలో 48040, ఎన్‌టీఆర్‌లో 58154, పల్నాడులో 50300 మంది కలిపి మొత్తం 2 లక్షల 83 వేల 735 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలానే ఆఫ్‌లైన్‌లో ఈ ఆరు జిల్లాల నుంచి 49048 మంది దరఖాస్తులు పెట్టారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి మొత్తం 3 లక్షల 32 వేల 783 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు.

దరఖాస్తుల పరిష్కారం ఇలా..

ఓటరు దరఖాస్తులను మూడు దశల్లో పరిష్కరించారు. తొలుత బీఎల్‌వోల ద్వారా కార్యశాలలో దరఖాస్తులను పరిశీలింపచేశారు. ఆ తర్వాత వాటిని ఏఈఆర్‌వోలు పరిశీలించి ఆమోదించారు. వాటిని ఆఖరుగా ఈఆర్‌వో పరిశీలించి ఆమోదం తెలిపారు. అర్హతలు సరిగా జత చేయని దరఖాస్తులను తిరస్కరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 2 లక్షల 35 వేల 295 ఆమోదించారు. 32,093 తిరస్కరించారు. ఇంకా ఏఈఆర్‌వో లాగిన్‌లో 11,758, ఈఆర్‌వో వద్ద 4589 పెండింగ్‌లో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 47742 ఆమోదించారు. 980 తిరస్కరించారు. 326 పెండింగ్‌లో ఉన్నాయి.


గుంటూరులోనే ఎక్కువ దరఖాస్తుల పెండింగ్

బుధవారం సాయంత్రానికి పెండింగ్ ఉన్న 5.01 శాతం దరఖాస్తుల్లో ఎక్కువ సంఖ్యలో గుంటూరు జిల్లాలోనివే ఉన్నాయి. మొత్తం 16673 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటిల్లో 11249 గుంటూరు జిల్లాలోనివే. గుంటూరు నగరంలోనివి ఎక్కువగా ఉన్నాయి. బాపట్లలో 751, ఏలూరులో 354, కృష్ణలో 277, ఎన్‌టీలో 1443, పల్నాడులో 2599 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇవన్నీ అర్ధరాత్రి లోపు క్లియర్ చేసి ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ కోసం పంపుతామని ఈఆర్‌వో కాజావలి తెలిపారు.

డిసెంబరు 9వ తేదీ వరకు ఓటుహక్కుకు అవకాశం

● ఈఆర్‌వో ఎన్ఎస్‌కే కాజావలి

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలో ఓటుహక్కు పొందేందుకు డిసెంబరు 9వ తేదీ వరకు అవకాశం ఉందని ఈఆర్‌వో ఎన్ఎస్‌కే కాజావలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసా యిదా ఓటర్ల జాబితా ఈ నెల 23వ తేదీన ప్రచురిం చడం జరుగుతుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబి తాపై అభ్యంతరాలను అదే రోజు నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుం దన్నారు. అర్హత ఉండి ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకుంటే వారు కూడా డిసెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కొత్త దరఖాస్తులు కూడా స్వీకరిస్తామ న్నారు. అభ్యంతరాలను డిసెంబరు 25న పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తామని చెప్పారు.



వివా, వీవీఐటీలో శ్రీశృంగేరీ పీఠాధిపతి

విద్యార్థులకు విధుశేఖరభారతీస్వామి ఆశీర్వచనాలు



స్వామీజీ వద్ద ఆశీర్వాదం పొందుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ దంపతులు

పెదకాకాని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయ యాత్రా మహో త్సవంలో భాగంగా గుంటూరు పర్యటనకు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి బుధవారం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహాస్వామి విద్యార్థులకు, అధ్యాపకులకు ఆశీర్వచనాలను అందజేశారు. తొలుత కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. విద్యార్థులను కేవలం పిల్లలు అని మా త్రమే అనుకూడదని వారు దేశం యొక్క అపారమైన భవిష్యత్ అన్నా రు. ధృడమైన లక్ష్యం ఎంచుకుని వాటిని సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. గొప్పవాళ్లం కవాలనుకుంటే సరిపోదని దానికి తీవ్రమైన కోరిక, కృషి కలిగి ఉండాలని ఉపదేశించారు. దేశం, ధర్మం రెండూ రెండు కళ్ళవంటివని వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరి బదరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల నిరసన

గుంటూరు(తూర్పు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్లుకు రావాల్సిన ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాలపరి మితి జీవోను రద్దు చేయాలని యానిమే టర్స్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా డీఆర్డీఏ కార్యాలయం ఎదుట బుధవారం యానిమేటర్లు నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాని మేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాలకే యానిమే టర్లు ఉద్యోగం వదిలి వెళ్లాలనడం సరైనది కాదన్నారు. యాని మేటర్లకు సెల్‌ఫోన్లు, 5జీ నెట్‌వర్క్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కే పద్మ, విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

● మృత్యుతో పోరాడుతున్న భర్త

పెదకాకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త మృత్యువుతో పోరాడుతున్న సంఘటన బుధవారం పెదకాకానిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదకాకాని సదాశివ నగర్‌లో పావని, కృష్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. కృష్ణ అన్ని ఫంక్షన్లకు ఈవెంట్ మేనేజ్మెంట్ చేస్తుంటాడు. భార్య పావని(వయస్సు 26సం) మంచి సింగర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వీరిద్దరూ కలిసి ఈవెంట్ ఆర్గనైజేషన్ చేస్తుంటారు. వ్యక్తిగత పనులపై విజయవాడ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద నుంచి పెదకాకాని మెయిన్ సెంట ర్‌కు వస్తుండగా, సెంటర్ సమీపంలోని గౌడ పాలెం కార్నర్ వద్ద ఓ ప్రైవేటు స్కూలు బస్సు బ్రేక్ ఫెయిల్ అయ్యి అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పావని అక్కడికక్కడే మృతి చెంద గా, ఆమె భర్త కృష్ణ తీవ్రగాయాలతో మృత్యు వుతో పోరాడుతున్నాడు. కాకాని రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తుల బైండోవర్

ఈపూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి తహసీల్దారు వద్ద బైండోవర్ చేయడం జరిగిందని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని రొంపిచర్లకు చెందిన రామిరెడ్డి, కృష్ణారెడ్డిలు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడిచేసి అరెస్టు చేశామన్నారు.



దాడి కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నిందితులకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవల్లిక బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 31న ఇంటి వద్ద ఉన్న తనపై పట్టణంలోని పాతూరుకు చెందిన షేక్ కరీంభాష, అయిలా బజారుకు చెందిన చేబ్రోలు శ్రీకాంత్, చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన చల్లా అంకమరావులు మరికొందరితో కలిసి క్రికెట్ స్టంపులతో దాడి చేసినట్లు బరంపేట నివాసి అబ్దుల్ అజీజ్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టుచేసి బుధవారం న్యాయాధికారి ఎదుటహాజరుపరచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట: స్థానిక నరసరావుపేట సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ ఈ కార్నర్ విభాగంలో బుధవారం కొత్త క్యాష్ డిపాజిట్ మిషన్‌ను బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ సురేష్ కుమార్ ప్రారంభించారు.

● చిలకలూరిపేట: స్థానిక చినపసుమర్రులో ఉన్న శ్రీఅయ్యప్పస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం మండల మహోత్సవంలో భాగంగా నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● చిలకలూరిపేట: రాష్ట్రంలో పత్తి, ధాన్యం రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఎమ్మెల్సీ మరి రాజశేఖర్ శాసన మండలిలో బుధవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధాన్యంను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు జరపాలని రాజశేఖర్ కోరారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాప్జెమిని ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.

● నరసరావుపేట టౌన్: వరికపూడిశెల ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు పనులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారని శాసనమండలిలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో జలవనరుల శాఖామంత్రిని ప్రశ్నించారు.

● నరసరావుపేట టౌన్: డాక్టర్ కోడెల శివప్రసాదరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఈ నెల 23న నరసరావుపేట రాజాగారి కోట డాక్టర్ కోడెల శివప్రసాదరావు హాస్పటల్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని మందాడి రవి బుధవారం తెలిపారు.

● నరసరావుపేట టౌన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జూడో జట్టుకు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్ మోహబూబ్ మస్తాన్ వలి ఎంపిక అయ్యాడని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఎంపికైన షేక్ మోహబూబ్ మస్తాన్ వలిని కళాశాలలో అభినందించారు.

● నరసరావుపేట లీగల్: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాత పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ బాలల హక్కుల పరిరక్షణపై వివరించారు.

● రొంపిచర్ల : మండలంలోని రొంపిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ప్రజ్ఞ, చంద్రికలు అండర్ - 14 విభాగంలో జిల్లా త్రోబాల్ జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సుభానీ బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 27, 28 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరుపున ఆడతారని తెలిపారు.

● మతుకుమల్లి (శావల్యాపురం): మండలంలోని మతుకుమల్లిలో గతేడాది జరిగిన ఉపాధి పనుల కూలీల వేతనాల్లో అక్రమాలు జరిగాయని కూలీలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డ్వామా పీడీ బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణ కోసం మతుకుమల్లికి వచ్చిన డ్వామాపీడీ డీపీవో కోసం మధ్యాహ్నం వరకు ఎదురు చూసినా ఆయన రాకపోవడంతో స్థానిక అధికారులతో కలసి విచారణ చేశారు.

● నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి ఆలయానికి శృంగేరి శారదాపీఠం విధుశేఖర భారతి మహాస్వామి విజయోత్సవ యాత్రలో భాగంగా గురువారం వస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖరరావు తెలిపారు. స్వామి ఉదయం 9గంటలకు విచ్చేయనున్నారు.

● వినుకొండ: శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాలు కలిగే నష్టాలు గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం సీడీపీవో అనురాధ అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామ సభలు

నూజెండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పరాజువారిపాలెం, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం అధికారులు ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ సభలో చర్చించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు నిడమానూరి మాధవి శ్రీనివారావు, సోము చిన నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ బొట్ల అంజయ్య, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, ఉపాధి హామి టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నాటికి 46వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు

● కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావు పేట రూరల్, నవంబరు 20: (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో మంజూరైన 94,512 కుళాయి కనెక్షన్లకు గానూ ఫిబ్రవరి 2025 నాటికి 46,316 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ (జల్ జీవన్ మిషన్)పై కలెక్టర్ పి.అరుణ్ బాబు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రానున్న ఎండాకాలంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.3.87కోట్ల ప్రణాళికను ఆమోదించారు. ఈ మొత్తాన్ని బోరుబావుల పునరుద్ధరణ, పశువుల రక్షణ వంటి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. సమావేశంలో టాయిలెట్ ఫర్ డిగ్నిటీ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 10 వరకు మానవ హక్కుల దినోత్సవం, పరిశుభ్ర శౌచాలయాల ఆవశ్యకత తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో విశిష్ట సేవలు అందించిన నలుగురు క్లాప్ మిత్రలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ విజయకుమార్, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాసమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, డీపీవో విజయ భాస్కర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ బాలు నాయక్, డీఎంహెచ్‌వో రవి తదితరులు పాల్గొన్నారు.



టాయిలెట్ ఫర్ డిగ్నిటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు
● గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణ

యడ్లపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే అని పల్నాడుజిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని దిగువ ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధుడు ఎడ్డూరి వెంకట్రావు ఆయన కుమారుడు నాగరాజుల మధ్య గత కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. కుమారుడు దురుసు ప్రవర్తనపై తండ్రి పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయంచేయాలంటూ పోలీసులను, న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీనితో ఎస్పీ బుధవారం వెంకట్రావు గృహాన్ని సందర్శించి ఫిర్యాది వెంకట్రావును, కుటుంబ సభ్యులను విచారించారు. వెంకట్రావు మాట్లాడుతూ తనతోపాటు భార్య, కుమారుడు, కోడలు, మనుమలు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నామని, చిన్న ఇల్లు కావడంతో తాను బయట పడుకోవాల్సి వస్తోందన్నారు. చెడుమార్గంలో వెళుతున్న కుమారుడిని పలుమార్లు మందలించానని, అయినా తీరు మార్చుకోలేదన్నారు. కుమారుడి కోసం అప్పులు చేశానని, అవి తీర్చే విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తనకు కుమారుడు తిండి పెట్టడం లేదన్నారు. కుమారుడి తీరుతో విసిగిపోయిన తాను ఇల్లు విడిచిపోవాలని కోప్పడ్డానని, దీనితో తనను కొట్టినట్లు ఎస్పీకి వివరించారు. అనంతరం కుమారుడు నాగరాజు తన తండ్రి మద్యంకు బానిసై అప్పులు చేసినట్లు ఆరోపించాడు. తాను నూతనంగా గృహం నిర్మించుకోవడానికి ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలం ఇవ్వడానికి తండ్రి నిరాకరించినట్లు ఎస్పీకి తెలిపాడు. దీనితో ఎస్పీ నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల ఆలనాపాలనా చూడాల్సిన బాధ్యత కన్న బిడ్డలదేనన్నారు. తండ్రిని ఆదరిస్తే స్థలం ఇస్తాడని, కొడితే ఇవ్వడని ప్రవర్తన మార్చుకుని బాధ్యతగా ప్రవర్తించాలని హితవు పలికారు. తండ్రిపై మరోసారి చేయిచేసుకుంటే కేసు నమోదుచేస్తామని హెచ్చరించారు. నాగరాజు నూతన ఇంటి నిర్మాణానికి సహకరించాలని అక్కడకు వచ్చిన స్థానిక పెద్దలను కోరారు. ఆయన వెంట చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



ఫిర్యాది వెంకట్రావుతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

రీ సర్వే చేసిన భూములకు ప్రత్యేక నంబరు

● రెవెన్యూ, మున్సిపాల్టీ హద్దులను కేటాయిస్తాం ● అగ్రహారం భూములకు రీసర్వే ● జిల్లా సర్వేయర్ భానుకీర్తి

వినుకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక నెంబర్ కేటాయిస్తామని పల్నాడు జిల్లా సర్వేయర్ భానుకీర్తి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 153/ఎలో విఠంరాజుపల్లి గ్రామానికి చెందిన రొడ్డా చిన్న వెంకటరెడ్డి రీసర్వేలో తన భూమి తగ్గిందని ఫిర్యాదుచేసిన నేపథ్యంలో బుధవారం భూములు పరిశీలించి రీసర్వే చేసేందుకు వినుకొండ రావడం జరిగిందని ఆమె తెలిపారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రొడ్డా చినవెంకటరెడ్డికి చెందిన భూమి 2.17ఎకరాలకు గాను రీసర్వేలో కేవలం రెండు ఎకరాలు ఉందని ఫిర్యాదుచేశారని, ఎఫ్ఎంబీ ప్రకారం తన భూమి తనకు ఉందని త్వరలో గట్టు సర్దుబాటు ద్వారా భూమి కేటాయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం 4ఎకరాల 81సెంట్లు ఉందని, ఎఫ్ఎంబీలో 6.79ఎకరాలు నమోదైందని, బ్రిటీష్‌వారి సర్వే ప్రకారం ఆర్ఎస్ఆర్‌లో తప్పుగా నమోదైనట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా వినుకొండ నియోజకవర్గ పరిధిలోని వాగులు, వంకలకు సంబంధించిన సర్వే రికార్డులు అందుబాటులో లేకపోవడంతో భూములు ఆక్రమణలకు గురయ్యా అని విలేకరులు ప్రశ్నించగా త్వరలో దానికి సంబంధించిన రికార్డులను వెలికితీస్తామని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 363గ్రామాల్లో రీసర్వే ప్రారంభించామని, ఇప్పటికే 47 గ్రామాల్లో పూర్తిచేశామని తెలిపారు. వినుకొండ పరిధిలోని అగ్రహారం భూములకు రీసర్వే ద్వారా రైతులకు ప్రత్యేక నంబరు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమలకు గురైతే రెవెన్యూ, సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఆక్రమణలకు గురైన భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 10 రెవిన్యూ అగ్రహారాలు ఉన్నాయని, వినుకొండలో నాగులవరం, శివాపురం గ్రామాల్లో రీసర్వే ద్వారా రైతులకు హక్కులు కల్పిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో ఆక్రమణలకు గురైన భూములను గుర్తించాలన్నారు. కన్వర్షన్ లేని వెంచర్లను అన్‌అప్రూవల్ లేఔట్లుగా గుర్తిస్తామని వివరించారు. భూములు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ జరగకుండ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. త్వరలో మున్సిపాల్టీ పరిధిలో భూములకు సర్వే ద్వారా రెవెన్యూ, అర్బన్ హద్దులను గుర్తించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆమె వెంట డీఐవోఎస్ శేషగిరి, వెంకటేశ్వర్లు, వినుకొండ ఇన్‌చార్జి సర్వేయర్ చండీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సర్వేయర్ భానుకీర్తి, డీఐవోఎస్ శేషగిరి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రవికాంత్, పక్కన గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తూమాటి రవికాంత్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీ నిర్మల బాయ్, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, పీవీ హనుమంతురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: శావల్యాపురంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి గంగవరపు అర్జున్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, డైరెక్టర్ అజిత్‌చంద్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ సింగ్‌లు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: స్థానిక బొల్లాపల్లి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ సర్పంచ్ జీ జ్యోత్స్న, గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్ వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిచినట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డీ యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, లైబ్రేరియన్ అండ్ ప్రోగ్రామ్ కన్వీనర్ కేఎల్‌ఎం ప్రసాద్, వై శ్రీకాంత్, జె మల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు, హెచ్‌ఎంలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు సుబ్బారావు, వెంకటరావు పేర్కొన్నారు.

విధుశేఖర భారతీ స్వామికి అపూర్వ స్వాగతం

నరసరావుపేట కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి). విజయయాత్ర సందర్భంగా బుధవారం పట్టణానికి విచ్చేసిన జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామికి భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. శంకరమఠం నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, మేళతాళాల నడుమ మఠానికి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆయన మఠంలోని ఆలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోసం కల్యాణ మండపంలో అనుగ్రహభాషణం చేశారు.

కోటప్పకొండలో విస్తృత ఏర్పాట్లు: డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట లీగల్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకరమఠం జగద్గురు శంకరాచార్య భారతి మహాస్వామీజీ గురువారం కోటప్పకొండకు వస్తున్న కారణంగా బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రూట్లు చెక్‌పోస్టు బందోబస్తు ఏర్పాటు ప్రణాళికలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఉచిత శస్త్రచికిత్సలు: ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి

శావల్యాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పుట్టకతో లోపాలున్న విద్యార్థులను ప్రభుత్వం గుర్తించి వారికి ఉచిత వైద్యసేవలను అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా నిర్వహిస్తుందని ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారిణి రాజరాజేశ్వరి అన్నారు. శావల్యాపురంలోని అంగనవాడీ, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని ఆమె బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల వద్దనున్న ఆర్‌బీఎస్‌కే కార్డులను తనిఖీచేసి విద్యార్థుల్లో లోపాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రావిపూడి రమ్య, హెల్త్‌సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఏఎన్‌ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

సర్వేల నిర్వహణలో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం

శావల్యాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన సర్వేలు నిర్వహించడంలో వెలుగు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వీవోఏలు డ్వాక్రామహిళల ఇంటింటికీ తిరిగి వారి కుటుంబ వివరాలు సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తే వీవోఏలు దేవాలయాల్లో, ఇతర ప్రదేశాల్లో కూర్చొని వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూలీలు గరిష్ట వేతనాన్ని పొందేలా పనిచేయాలి: డ్వామా పీడీ

శావల్యాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు గరిష్ట వేతనం రూ.300 పొందేందుకు కష్టపడి పనిచేయాలని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. శావల్యాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. డ్వామాపీడీ మాట్లాడుతూ ఉన్నతి పథకంలో భాగంగా ప్రభుత్వం 100 పనిదినాలు పూర్తి చేసిన కూలీల కుటుంబ సభ్యులకు వ్యక్తిగత నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, జేఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో రెండు దుకాణాలు దగ్ధం.. రూ.45 లక్షల ఆస్తి నష్టం

చిలకలూరిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో బుధవారం ఉదయం రెండు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.45 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగింది. వీ మొబైల్స్ అనే సెల్ ఫోన్ దుకాణంలో తొలుత మంటలు ప్రారంభమై పక్కనే ఉన్న తోట వీరమ్మ సైకిల్ షాప్‌కు అంటుకుని రెండు షాపులు దగ్ధమయ్యాయి. మొబైల్ దుకాణంలోని సెల్ ఫోన్లు, ఇతర సామాగ్రి, సైకిల్ షాప్‌లోని టైర్లు, సైకిళ్లు, ఇతర విడిభాగాలు మంటలలో కాలిపోయాయి. సెల్‌ఫోన్ షాపులో సుమారు రూ.30 లక్షల మేరకు, సైకిల్ దుకాణంలో సుమారు రూ.15 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని అంచనా. ప్రమాద వార్త తెలిసి జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్ శ్రీధర్, చిలకలూరిపేట ఫైర్ ఆఫీసర్ ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రమాద స్థలానికి వచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. తాజా నిబంధనల ప్రకారం బాధితులకు ఆకడకక్కడే ఫైర్ సర్టిఫికెట్లు అందచేశారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్, ఎస్ఐ చెన్నకేశవులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు.



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆర్‌సీఎం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

వినుకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలలపాలెం ఆర్‌సీఎం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నాల్గో తరగతి విద్యార్థులు పట్టణంలోని గిరిజన పాఠశాలలో తమ ప్రతిభను కనపరిచారు. పిడతల అక్షయ్ పిరియాడిక్ టేబుల్, అటమిక్ మాస్, పై వ్యాల్యూషన్‌కు సంబంధించిన 5వేల అంకెలను చూడకుండా చెప్పాడు. కెమికల్ ఫార్ములాస్ 150కి పైగా, స్క్వేర్స్‌కు 100కి పైగా చెప్పి అందరినీ ఆకట్టుకున్నారు. ఇదిలా ఉండగా తెల్లమేకల మణికంఠ, కొడిమెల ఆనంద్, శివరామ్‌లు 3600కు పైగా ఇంగ్లీష్ పదాలకు స్పెల్లింగ్ చూడకుండ చెప్పడంతో వారి ప్రతిభకు మెచ్చిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంటా సరసర్వతి వారికి నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించి వారిని అభినందించారు. వారికి విద్యను నేర్పిన బొల్లినేని బాలస్వామి మాస్టార్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. త్వరలో వీరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

● తహసీల్దార్ విజయశ్రీ





యడ్లపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ ఆంధ్రజ్యోతికి బుధవారం తెలిపారు. భూముల రీ సర్వే సమస్యలపై, గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లోని సమస్యల పరిష్కారంపై పలువిషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: రీసర్వేలో తప్పులు దొర్లడానికి ప్రధాన కారణం ఏమిటి?

జవాబు: సర్వే నంబరులో ఉన్న పూర్తి విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణాన్ని నమోదు చేయించుకోవడం, గతంలో జరిపిన కొలతల్లో తేడాలు, రీసర్వే సమయంలో భూ యజమానులు అందుబాటులో లేకపోవడం, హక్కుపత్రాలు చూపకపోవడం తదితర అంశాలు తప్పులు దొర్లడానికి కారణమయ్యాయి.

ప్రశ్న: తప్పుల సరిచేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణకు ప్రభుత్వం ఆదేశాలతో గ్రామసభలను నిర్వహించి అర్జీలను స్వీకరించడం జరిగింది. సుమారు 545కు పైగా అర్జీలు వచ్చాయి. త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఏ విషయంలో అధికంగా తప్పులు దొర్లాయి?

జవాబు: ప్రధానంగా విస్తీర్ణంలో వ్యత్యాసాలున్నాయంటూ 296 అర్జీలు రాగా విస్తీర్ణం సరిపోయి జాయింట్ ఎల్పీ నంబర్లు విభజించాలంటూ 83, మ్యుటేషన్, ఇతర అంశాలకు సంబంధించి 150కి పైగా దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: ఇప్పటివరకు పరిష్కరించిన అర్జీలు ఎన్ని?

జవాబు: విస్తీర్ణం సరిపోయి జాయింట్ ఎల్‌పీ నంబర్లు విభజించాలంటూ వచ్చిన దరఖాస్తులు దాదాపు పరిష్కారం అయ్యాయి. విస్తీర్ణంలో తేడాలకు సంబంధించిన వాటిని తిరిగి సర్వే చేయించి సరిదిద్దాల్సి ఉంది. వాటి పరిష్కారానికి కొంత సమయం పట్టేలా ఉంది.

నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోళ్లు

సీసీఐ కేంద్రాలను సందర్శించిన మార్కెటింగ్ డైరెక్టర్

నాదెండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే సీసీఐ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నదని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురడిగి అన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, అచ్చం నాయుడులు తేమ శాతం పేరుతో రాష్ట్రంలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయటం లేదని, తిరస్కరిస్తున్నారని సీసీఐ సీఎండీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ముంబై సీసీఐ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన మార్కెట్ డైరెక్టర్ గణపవరం, తిమ్మాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తిల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లలో ఉన్న పత్తి తేమ శాతాన్ని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సీసీఐని ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 12శాతం లోపు తేమ ఉన్న పత్తిని మూడు ధరలలో కొనుగోలు చేస్తున్నామన్నారు. పత్తిని ఆరబెట్టి తెచ్చినట్లయితే రైతుకు గిట్టు బాటు ధర లభిస్తుందని వివరించారు. ఆయనతో పాటు సీసీఐ జీఎం అమరనాథ్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ జేడీలు కే శ్రీనివాసరావు, రాజశేఖర్, బయ్యర్ రమేష్, యార్డు కార్యదర్శి యోగేశ్వరరావులు ఉన్నారు.



గణపవరం సీసీఐ కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ విజయ్

పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అధికారులు

నాదెండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబుతో పాటు పలువురు అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు చంద్రకళ విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న విద్యార్థుల గురించి ప్రశ్నించారు. గ్రామంలో పరిశ్రమల పరిస్థితి బాగా లేనందున వివిధ రాష్ట్రాలకు చెందిన వారు స్వరాష్ట్రాలకు వెళ్తున్నారని, ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య తగ్గిందని హెచ్‌ఎం కృష్ణానాయక్ వివరించారు. కాగా పాఠశాల అదనపు గదుల నిర్మాణం పెండింగ్‌లో ఉందని, శ్లాబులు వేయాలని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ హిమవంతరావు కోరారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న మాజీ సర్పంచ్ హిమవంతరావు

స్థల ఆక్రమణ ఫిర్యాదుపై ఆర్డీవో పరిశీలన

నాదెండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని స్కూల్, కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేశారని గణపవరం గ్రామానికి చెందిన ఆవుల సాంబశివరావు చేసిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో మధులత ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఫిర్యాది సాంబశివరావు తన వాదనలను వినిపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురికి రెవెన్యూ, పంచాయతీ వారు నోటీసులు ఇవ్వాలని సూచించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను తీసుకొని నివేదిక పంపాలని కోరారు. ఆమెతో పాటు తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి, కార్యదర్శి మారుతీబాబు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కందుల

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిలకలూరిపేటకు చెందిన కందుల వెంకటరమణను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర స్థాయిలో చిలకలూరిపేటలో మొట్ట మొదటి పదవి లభించింది. ఈ పదవి రావటానికి సహకరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు కందుల వెంకట రమణ కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సందర్భంగా కందులను మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీ, నియోజ వర్గ సమన్వయ కర్త నెల్లూరి సదాశివరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, అజారుద్దీన్, వాహబ్, కోటేశ్వరరావు, సుభానీ తదితరులు అభినందించారు.



కందుల వెంకటరమణ

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మురళీకృష్ణ యాదవ్

నూజెండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని తలార్లపల్లి గ్రామానికి చెందిన మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా మీసాల మురళీకృష్ణ యాదవ్ బుధవారం మాట్లాడుతూ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థికి రూ.10 వేలు ఆర్థికసాయం

వినుకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో సాయి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థికి గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవ రూ.10వేలు ఆర్థికసాయం ప్రకటించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఈ చెక్కును పంపిణీచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఆంజనేయులు, షమీమ్, ఆయుబ్‌ఖాన్, సురేష్, సౌదాగర్ జానిబాషా, చికెన్‌బాబు, అజీజ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.